

23న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద క్రైస్తవుల ధర్నా

ప్రజాశక్తి-కొవ్వూరు

ఈ నెల 23న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద క్రైస్తవుల హక్కులు సాధన కోసం చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఆలిండియా క్రిస్టియన్ జెఎసి జాతీయ కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ కోరారు. కొవ్వూరులో మంగళవారం నిర్వహించిన నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ పోస్టర్‌ను విడుదల చేశారు. బిషప్ విల్లియమ్స్, రెవరెండ్ సాక్షిబాబు ఈ పోస్టరణు విడుదల చేశారు. ఆలిండియా క్రిస్టియన్ జెఎసి జాతీయ అధ్యక్షుడు మల్లెల రాజు ఆధ్వర్యాన నిర్వహించే ఈ కార్యక్రమంలో అమలాపురం మాజీ ఎంపీ జివి.హర్షకుమార్, మాజీ ఐఎఎస్ అధికారి లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జిఎస్ఆర్‌కె.విజయ్‌కుమార్, డిజిపి సునీల్ కుమార్ పాల్గొంటారని రవిప్రకాష్ తెలిపారు.

కొబ్బరి, అరటి ధరల జోష్

- ఎగువ రాష్ట్రాల్లో పెరిగిన డిమాండ్
- జోరందుకున్న ఎగుమతులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అరటి, కొబ్బరి మార్కెట్లలో పండుగ సందడి నెలకొంది. దసరా నేపథ్యంలో ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులకు కాస్తంత ఊరట లభించింది. ఉభయ గోదావరి జిల్లాల్లో అరటి టన్ను రూ.13,000 నుంచి రూ.15000 చొప్పున ఎగుమతులు సాగుతున్నాయి. ఉగాది అనంతరం టన్ను రూ.700లకు పడిపోయిన విషయం విదితమే. ప్రస్తుతం శ్రావణ మాసం నేపథ్యంలో ధరలు పెరగడంతో రైతులు పంట దిగుబడులను మార్కెట్లకు తరలిస్తున్నారు. కొబ్బరి ధరలు 2 నెలలుగా ఆశాజనకంగా స్థిరంగా ఉన్నాయి. బొండాలు వెయ్యి కాయలు గత వారంలో కాయ సైజు ఆధారంగా రూ.12,000 నుంచి రూ.13,500 వరకూ కొనుగోళ్లు సాగాయి. ప్రస్తుతం రూ.19000 చొప్పున కొనుగోళ్లు సాగుతున్నాయి. గండేరా కాయలు రూ.28000 చొప్పున ధర ఉంది. కురిడీ కాయలు రూ.21,000, ఈ రకంలో గటగట కాయలు రూ.29,000 చొప్పున కొనుగోళ్లు సాగుతున్నాయి. లోకల్ మార్కెట్‌తో పాటు మహారాష్ట్ర, బీహార్, ఒడిషా, హైదరాబాద్, నిజామాబాద్, ముంబయి, రాయ్‌పూర్ తదితర ప్రాంతాలకు అరటి, కొబ్బరి ఎగుమతులు జరుగుతున్నాయి.



తూర్పు, కోనసీమ జిల్లాల్లో విస్తారంగా సాగు

కోనసీమ జిల్లాలో రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, అంబాజీపేట మండలాల్లో అరటి విస్తారంగా సాగు చేస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో కొవ్వూరు, పెరవలి, ఉండ్రాజవరం, తాళ్లపూడి మండలాలతో అరటి సాగు అధికంగా ఉంది. వీటితో ఈ రెండు జిల్లాల్లో మరో 8 మండలాల్లో అక్కడక్కడా అరటి సాగు ఉంది. అధికారుల గణాంకాల ప్రకారం రెండు జిల్లాల్లో సుమారు 45,000 ఎకరాల్లో అరటి తోటలు సాగవుతున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా రైతులు 25 వేల మంది, వ్యాపారులు మరో 3 వేల మంది అరటిపంటపై ఆధార పడి జీవిస్తున్నారు. జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. మరో 20 వేల ఎకరాలకు సరిపడా చెట్లు ఇళ్ల వద్ద, పొలాల గట్ల వెంబడి, కాలువ గట్లపైన వేలాది చెట్ల ద్వారా కొబ్బరి సాగవుతోంది. ఏటా జిల్లాలో 105 కోట్ల కొబ్బరి కాయల దిగుబడి వస్తుందని అంచనా. తెలంగాణ, తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు కొబ్బరిని ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. కొబ్బరి సాగుపై ఆధార పడి ప్రత్యక్షంగా, పరోక్షంగా జిల్లాలో సుమారు 40 వేల మంది ఉపాధి పొందుతున్నారు.

రోజూ 200 లారీల ఎగుమతి

జిల్లాలోని రావులపాలెం, పెరవలి నుంచి అరటి, అంబాజీపే మార్కెట్ నుంచి కొబ్బరి కాయల దిగుబడులు రోజూ 300 లారీలు ఎగుమతి జరుగుతున్నాయి. సాధారణంగా 100 నుంచి 150 లారీలలో అరటి, కొబ్బరి దిగుబడులు ఎగుమతులు జరుగుతుంటాయి. తాజాగా పండుగ సీజన్‌లో డమాండ్ నెలకొనడంతో రైతులకు కొంత ఊరట లభించింది. పండుగలు మినహా మిగిలిన రోజుల్లో ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ అరటి నిల్వ చేసుకునే సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. కొబ్బరి ఉత్పత్తులు కొనుగోలుకు ఏర్పాటు చేసిన నాఫెడ్ కేంద్రాలపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచి, రైతులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

స్వలంగా కొబ్బరి ధరలు పెరిగాయి

ఆరెకరాలు కౌలుకు తీసుకుని కొబ్బరి సాగు చేస్తున్నాను. గండేరా కాయలు రూ.26,000 నుంచి సైజు ఆధారంగా రూ.28000 చొప్పున కొనుగోలు జరుగుతున్నాయి. కురిడీ కాయలు రూ.19,500 నుంచి రూ.21,000, ఈ రకంలో గట గట కాయలు రూ.27,000 నుంచి రూ.29,000 చొప్పున కొనుగోళ్లు సాగుతున్నాయి. రెండు నెలలుగా ధరలు స్థిరంగా ఉన్నాయి. సాధారణ రోజుల్లో రూ.10,000 మించడం లేదు. ఏడాదిలో పండుగలకు మాత్రమే డిమాండ్ ఉంటుంది. ఇతర రోజుల్లో తక్కువ ధరలకు విక్రయించక తప్పడం లేదు. కొన్నిసార్లు వేసవిలో సైతం బొండాలకు ధరలు ఉండటం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాఫెడ్ కేంద్రాలపై పర్యవేక్షణ పెంచాలి.

- వి.వెంకటేశ్వరరావు, అంబాజీపేట కొబ్బరి రైతు.

అరటి ధరల పెంపుతో ఊరట

అరటి ధరలు స్వల్పంగా పెరగటంతో కొంత ఊరట లభించింది. రెండు ఎకరాలు సాగు చేస్తున్నాను. వారం రోజులుగా టన్ను రూ.13,000 నుంచి రూ.15,000 చొప్పన కొనుగోళ్లు సాగుతున్నాయి. సాధారణ రోజుల్లో రూ.7000 మించడం లేదు. అరటి సాగుకు ఏటా పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నాయి. పదేళ్లలో పోలిస్తే ఎరువుల ధరలు 10 రెట్లు పెరిగాయి. పంట దిగుబడుల ధరలు ఆస్థాయిలో పెరగటం లేదు. పండుగలు మినహా మిగిలిన రోజుల్లో ధరలు ఉండడం లేదు. ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలి.

- కె.సత్యనారాయణ, ఉండ్రాజవరం మండలం.

ఇదీ అరటి ధరల తీరు

రకం	నెల రోజుల క్రితం	ప్రస్తుతం
కర్పూర	220-350	400-500
చక్రకేళి	250-300	400-500
అమృతపాణి	280-330	330-360
పచ్చ అరటి	100-200	150-250

సెప్టెంబర్ నుంచి క్యాన్సర్ సర్వే

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

సెప్టెంబర్ నుంచి కొత్తగా క్యాన్సర్ సర్వే నిర్వహించనున్నట్టు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రంలో రెండు, మూడో అంతస్తులను కలెక్టర్ పి.ప్రశాంతి, ఎంఎల్‌సి సోము వీర్రాజు, ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ వంటి వాటిని గుర్తించేందుకు వచ్చే నెల నుంచి కొత్తగా ఎన్‌సిడి 3 సర్వే నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆరోగ్య రంగాన్ని పటిష్ట పరచడానికి కూటమి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, ఆ చర్యలు నేడు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. రాజమహేంద్రవరం ఆసుపత్రిలో ఒపి కౌంటర్లను నాలుగు నుంచి 22కు పెంచామని, వీల్‌ఛైర్స్ ఏర్పాటు చేశామని, మరుగుదొడ్ల నిర్వహణ మెరుగు పరిచామని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించిన రెండు, మూడు అంతస్తుల పిల్లల ఆరోగ్య సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం మంత్రి ప్రతి గదినీ తిరిగి పరిశీలించారు. రోగులు, వైద్యులతో మాట్లాడి వారి ఇబ్బందులు, అవసరాలు తెలుసుకున్నారు. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ వెంకటేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రాజశేఖర్ కెనడీ, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



వైద్య విభాగాలను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

ప్రభుత్వాస్పత్రి వద్ద కార్పొరేట్ ఆసుపత్రి హవా

వైద్య రంగంలో కార్పొరేట్ హవా కొనసాగుతోంది. నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రసూతి విభాగ భవన అంతస్తులను మంత్రి సత్య కుమార్ యాదవ్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు కలెక్టర్, ఎంఎల్‌ఎలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్‌కు స్వాగతం పలుకుతూ బొల్లినేని కిమ్స్ ఆసుపత్రి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఇప్పటికే పలు ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల హోర్డింగులు దర్శనమిస్తున్నాయి. తాజాగా మరో అడుగు ముందుకేసి ప్రజా ప్రతినిధులకు స్వాగతం పలుకుతూ భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం విమర్శలకు దారి తీసింది.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

ప్రజాశక్తి-రాజానగరం

ఇతరులను ఇబ్బందికి గురి చేయాలని, బాధ పెట్టాలనే మానసిక రుగ్మతే ర్యాంగింగ్ అని, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం యాంటీ ర్యాగింగ్ వీక్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ హాజరై విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. జ్యోతి ప్రజ్వలన చేసి, నన్నయ విగ్రహానికి పూలమాల వేసి యాంటీ ర్యాగింగ్ వీక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగమని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి, డీన్ ఆచార్య ఎన్ ఉదయభాస్కర్, నందెపు నాగేంద్రరావు, అడ్వకేట్ వెంట్రప్రగడ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



న్యాయమూర్తి సునీతను సత్కరిస్తున్న సిబ్బంది

సత్యసాయి కార్మికుల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-గోపాలపురం

9 నెలల పెండింగ్ జీతాలు చెల్లించుకుంటే సమ్మె చేపడతామని శ్రీసత్య సాయి తాగునీటి పథకం వర్కర్స్ హెచ్చరించారు. వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ 9 నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, పెండింగ్ జీతాలు చెల్లించాలని లేని పక్షంలో ఈ నెల 22న విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 18 ఏళ్లుగా 17 మండలాల్లో 6 లక్షల మంది ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందిస్తున్నామని, అయినా ప్రభుత్వాలు మా సేవలను గుర్తించక పోవడం అన్యాయం అన్నారు. సుమారు 100 మంది కార్మికులకు 9నెలలు జీతాలు లేకపోవడంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు భారంగా మారిందని వాపోయారు.

రెవెన్యూ అధికారులపై వేటు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్ , గోపాలపురం


మాజీ సైనిక ఉద్యోగి నుంచి లేని భూమి ఉన్నట్టు చూపించి రూ.14 లక్షలు లంచం వసూలు చేసిన సంఘటనపై కలెక్టర్ పి.ప్రశాంతి కఠిన చర్యలు చేపట్టారు. అప్పటి గోపాలపురం ఎలక్షన్ డిటి, ప్రస్తుతం కొవ్వూరులో పని చేస్తున్న ఎస్.కృష్ణను సస్పెండ్ చేశారు. సంబంధిత విఆర్‌ఎలు జి.మనోహర్ (కరగపాడు), పి.నాని (గోపాలపురం)పై క్రమశిక్షణా చర్యలకు ఆదేశించారు. మాజీ సైనికులు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ రెడ్డి సమగ్ర విచారణ చేసి నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఈ చార్యలు తీసుకున్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-నిడదవోలు

పట్టణంలో ప్రభుత్వ జూనియర్స్ బాలుర కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్, పోక్సో చట్టాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నిడదవోలు సిఐ పివిజి.తిలక్ విద్యార్థుల భవిష్యత్తుపై దిశా నిర్దేశం చేశారు. మంచి చెడులు తెలియని వయసు నుంచి మంచి చెడులు తెలుసుకునే వయసుకు వచ్చిన యువత చెడు వ్యసనాల బారిన పడి తమ జీవితాన్ని చేజేతులారా పాడు చేసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు తమ నడతను, నడకను సరైన మార్గంలో ఎంచుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని అవగాహన హితవు పలికారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మీసాల శివరామ హరిప్రసాద్, దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్, గోపిరెడ్డి శ్రీనివాస్, ఎండి ఫయాజ్, సానెపు వెంకట సుబ్బారావు, ప్రిన్సిపల్ బి.మేరీ సుజాత పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



విద్యార్థుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం వామపక్ష విద్యార్థి సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రాజా ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షుడు భాను ప్రసాద్ మాట్లాడారు. విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం, విద్యారంగంలో ఉన్న అన్యాయాలపై పోరాటాల కోసం అన్నారు. ఈ పద్ధతిలో విద్యార్థి సంఘాలపై నిషేధం విధించడం ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే చర్య అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థుల సమస్యలు బయటకు రానీయకుండా అనగదొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ జిఓ తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, దినేష్, ధర్మేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, జ్యోతి, కార్తీక్, ఎఐఎస్ఎఫ్ నాయకులు త్రిమూర్తులు, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ రాంబాబు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

మార్కెట్ కమిటీల్లో డిజిటల్ విధానంపై సమీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్ మార్కెటింగ్ అధికారులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులతో సమీక్ష జరిపారు. ఇకపై మార్కెట్ కమిటీ చెక్‌పోస్టుల్లో డిజిటల్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి మార్కెట్ కమిటీలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని, చెక్‌పోస్టుల్లో పటిష్ట ఏర్పాట్లు చేసి, ప్రతి వాహనాన్నీ నిశితంగా పరిశీలించి ఖచ్చితమైన మార్కెట్ రుసుం వసూలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదాయం పెంచాలని సూచించారు. ప్రతి మార్కెట్ కమిటీ కార్యదర్శులు తమ పరిధిలో ఏ పంటలు, ఏ వ్యవసాయ ఉత్పత్తులు రవాణా అవుతున్నాయి, ఇతర రాష్ట్రాల నుండి లేదా ప్రాంతాల నుండి దిగుమతి అవుతున్న ఉత్పత్తులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మార్కెటింగ్ ఎడిఎం సునీల్ వినయ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. 1-19 ఏళ్ల లోపు వయసుగల పిల్లలకు మాత్రలు మిగించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కడియం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని కడియం హైస్కూల్‌లో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, ఎంపిడిఒ కె.రమేష్ మంగళవారం ప్రారంభించారు. 1 నుంచి 19 ఏళ్ల వయసు పిల్లలందరికీ నులిపురుగుల నిర్మూలన నిమిత్తం మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు వైద్యాధికారి డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం టి.సత్యనారాయణ, వైద్య సిబ్బంది విల్సన్ పాల్, కుందన నిర్మల పాల్గొన్నారు.

ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ బి.దుర్గామహేశ్వర రావు, డాక్టర్ ఆర్.ఉషాదేవి, వేలివెన్ను పిహెచ్‌సి పరిధిలో డాక్టర్ వై.సృజన ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ఆల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. సూపరింటెండెంట్ కెకె.సుభాషిణి, సిహెచ్ఒ ఎం సుబ్రహ్మణ్యం, సూపర్వైజర్లు కెడివిఎల్.కుమారి, శ్రీరామమూర్తి, రత్నకుమారి పాల్గొన్నారు.

గోకవరం కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ తీరన్ ఆధ్వర్యంలో మాత్రలు పంపిణీ చేశారు. పవన్, రమణ, పి.అనూష పాల్గొన్నారు.

బిక్కవోలు పిహెచ్‌సి డాక్టర్ ఎం.దుర్గాదేవి ఆధ్వర్యాన మాత్రలు పంపిణీ చేశారు. డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పెరవలి పెరవలి, కానూరు ప్రాథమిక పిహెచ్‌సిల పరిధిలో ఆల్బండెజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సర్పంచులు గంగోలు సీతమ్మ, భావన మధు పూర్ణచంద్, బీర సత్యవేణి రాజ్, ఎంపిపి కార్చెర్ల సీతారామప్రసాద్, సిహెచ్ఒ కె.జయమణి, కెవి.నాగేశ్వరావు, ఉంగండ రాజేష్, టిఎస్.దమయంతి, ఎఎన్ఎం టి.రాజేశ్వరి, లుథియారాణి, జి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావు ఆధ్వర్యాన పంపిణీ చేశారు. డాక్టర్ సిరాజ్ ఉద్దీన్, ఎం.జయప్రకాష్, మీరాబాయి, కృష్ణకుమారి, పి.సంకీర్తన పాల్గొన్నారు.

గోపాలపురం అన్నదేవరపేట, హుకుంపేట వైద్యులు స్వర్ణలత, గాయత్రి ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు హైస్కూల్లో ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు ఆల్బండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్, టుమెన్ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా

ప్రజాశక్తి-చాగల్లు, కడియం

హర్‌ఘర్ తిరంగా కాంపెయిన్‌లో భాగంగా బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, ఊనగట్ల, చంద్రవరం, నందిగంపాడు, ఎస్.ముప్పవరం పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల వద్ద భారత జాతీయతను ప్రదర్శించే విధంగా, జాతీయ జెండాలతో పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. బ్రాహ్మణగూడెం పంచాయతీలో డిప్యూటీ ఎంపిడిఒ శ్రావణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు.

కడియం మండలంలోని జేగురుపాడులో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఎంపిటిసి నాగిరెడ్డి రామకృష్ణ, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, మర్రెడి రమేష్, కర్రి చినబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఆర్.రంగనాథన్ జయంతి

ప్రజాశక్తి-చాగల్లు

గ్రంథాలయ శాస్త్ర పంచ సూత్రాల రూపకర్త పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ గనాథన్ 133 జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథ పాలకుడు కె.సుమన్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతి పాఠకుడు సులభంగా గ్రంథాలయంలోని పుస్తకాలను తీసుకోవడానికి, గ్రంథాలయ సేవలు ఎక్కువగా పాఠకులకు అందించడానికి ఆయన రూపొందించిన గ్రంథాలయ పంచ సూత్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు.

ఆరుతడి వ్యవసాయంపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, గోకవరం

మండలంలోని తాడిపర్రులో మంగళవారం వరి పంటలో ఆరుతడి వ్యవసాయంపై రైతులకు క్షేత్రస్థాయి శిక్షణ ఇచ్చారు. పాలంగి, వెలగదుర్రులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రామకృష్ణతో కలిసి, మండల వ్యవసాయ శాఖ అధికారి బి.రాజారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ప్రకతి వ్యవసాయ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్ ఇందిరా, మౌనిక, ముత్యాలు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గోకవరం రంపఎర్రంపాలెం, గుమ్మళ్లదొడ్డి యూనిట్ల పరిధిలో పెంటపల్లి, వెదురుపాకలో ఆరుతడి పద్ధతిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అడిషనల్ డిపిఎం వల్లి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పంటలపై క్షేత్రస్థాయిలో బయోచార్, భూమిలో నీటి పరిమాణం కొలిచే విధానం, వివిధ రకాల కాషాయాలతో డ్రోన్ డెమో ద్వారా రైతులకు అవగాహన కల్పించారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న సభ్యులు

'తిరుమల'లో సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కాతేరులోని తిరుమల విద్యా సంస్థల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు సిపిఆర్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంలో కార్డియాక్ అరెస్ట్ కేసులు పెరుగుతున్నందున సిపిఆర్ శిక్షణ చాలా అవసరమన్నారు. ఎలాంటి సమయంలోనైనా తక్షణమే ప్రతిస్పందించగలిగే ఈ సిపిఆర్ నైపుణ్యాలు నేర్చుకోవడం ప్రతి ఒక్కరికీ చాలా ముఖ్యమని తెలిపారు. సిపిఆర్ గుండెపోటు లేదా శ్వాస తీసుకోవడం అగిపోయిన వ్యక్తికి సాయం చేయడానికి ఉపయోగించే ప్రక్రియ అన్నారు. రోటరీ క్లబ్ రివర్ సిట్ ప్రెసిడెంట్ ఎల్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి, ఒత్తిడి స్థాయిలు పెరగడంతో యువకుల్లో సైతం కార్డియాక్ అరెస్ట్ సంఘటనలు ఎక్కువగా ఉంటున్నాయని తెలిపారు. డాక్టర్ వేణుగోపాల్ నోరి, డాక్టర్ ప్రియాంక, ఎ.దీపిక, పిడిజి.భాస్కర్ రామ్, ఎజివివిఎస్.కృష్ణారావు, జోనల్ కమ్యూనిటీ చైర్‌పర్సన్ నాగేంద్ర కిషోర్, తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి పాల్గొన్నారు.

మహిళల పాత్ర, హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-నిడదవోలు

మనోజ్ఞ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిడదవోలు ఎస్‌విడి మహిళా డిగ్రీ కళాశాలలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక స్వపరిపాలన, మహిళల పాత్ర, హక్కులు అనే అంశంపై ప్రిన్సిపల్ లెఫ్టినెంట్ డి.రుద్ర అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. డిపిఆర్‌సి జిల్లా ట్రైనింగ్ మేనేజర్ గుర్రాల ప్రసంగిరాజు అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వాల పాలనలో మహిళల పాత్ర చాలా కీలకమైనదని, మహిళా నాయకులు వారి హక్కులను పూర్తిగా వినియోగించుకుని ప్రజలకు సుపరిపాలన అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్‌పర్సన్ విజయ శ్రీనివాసరెడ్డి కుంచాల, ఫౌండర్ కుంచాల శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కంబయ్య, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ పి.ఉషారాణి, ఆర్ఆర్‌సి కో ఆర్డినేటర్ జె.శోభారాణి, డి.లావణ్య పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-నల్లజర్ల

అనంతపల్లిలో 20 ఏళ్లుగా ఒక అనాథ వ్యక్తి స్థానిక కూడలిలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడి ఆరోగ్యం బాగోక సోమవారం రాత్రి చనిపోవడంతో గ్రామస్తులు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. అనంతపల్లి బస్టాండ్ నుంచి మృతదేహాన్ని మానవత వ్యాన్‌లో శ్మశాన వాటిక వద్దకు తరలించి అంత్యక్రియలను పూర్తి చేసారు. పార్టీలకు అతీతంగా అందరూ రూ.20 వేలను అంత్యక్రియల అందజేశారు. మాజీ ఎంపిపి జమ్మల వీర వెంకట సతీష్, వల్లిరెడ్డి పృథ్వీరాజ్, తాతిన చైతన్య, దుళ్ల వెంకన్న, మీసాల అప్పలస్వామి, తాడిమళ్ల సతీష్, మామిడి అప్పారావు, యర్ర సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో పబ్లిక్ హెల్త్ యూనిట్లు

ప్రజాశక్తి-రాజానగరం

రాష్ట్రంలో 166, 162, 102 విడతల వారీగా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు మంజూరయ్యాయని ఆరోగ్య మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. జిల్లాలో 19 యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాజానగరం పిహెచ్‌సిలో రూ.50 లక్షలతో ఏర్పాటు చేయనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు మంత్రి సత్య కుమార్ శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి 15వ ఆర్థిక సంఘం నిధులతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎంఎల్‌సి సోము వీర్రాజు, నీరుకొండ వీరన్న చౌదరి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - కాకినాడ

టిటిడి కల్యాణ మండపం మేనేజర్ వేధింపులు తాళలేక వాచ్‌మెన్ భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం కాకినాడలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బాలాజీ చెరువు కూడలి వద్ద గల టిటిడి కల్యాణ మండపంలో వాచ్‌మెన్ కుశ్వంత్ పని చేస్తున్నాడు. అతని భార్య స్వీపర్‌గా పని చేస్తుంది. అయితే ఇటీవల కల్యాణ మండపానికి మేనేజర్‌గా వచ్చిన రాజు తమను దూషిస్తూ వేధించడమే కాకుండా తాను లేనప్పుడు తన భార్యను దూషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమెను దూషించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో హుటాహుటిన ఆమెను జిజిహెచ్‌కి తరలించారు. అనంతరం 100కి ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో ఆమె మెరుగైన వైద్యం అందడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. జరిగిన సంఘటనపై విచారణ చేసి తన కుటుంబానికి న్యాయం చేయాలని వాచ్‌మెన్ కుశ్వంత్ కోరారు.

అత్యాచారయత్నం ఘటనలో నిందితునికి రిమాండ్

ప్రజాశక్తి - కాట్రేనికోన

రాత్రివేళ ఇంటిలో నిద్రిస్తున్న వివాహితపై ఓ వ్యక్తి అత్యాచారయత్నం చేయడంపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు కాట్రేనికోన ఎస్ఐ అవినాష్ మంగళవారం తెలిపారు. నిందితుడిని ముమ్మిడివరం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్ విధించారని తెలిపారు. రెండు రోజుల క్రితం చెయ్యేరులోని బ్రాహ్మణ చెరువులో ఇంట్లో పిల్లలతో కలిసి నిద్రిస్తున్న వివాహితపై దార్ల అన్నవరం అలియాస్ చిన వీర వెంకట సత్యనారాయణ అత్యాచారయత్నం చేశాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట ప్రవేశ పెట్టామన్నారు. ఈ ఘటనలో నిందితునికి 15 రోజులు రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి 8 మంది అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని నర్సిపూడి శివారు పొలాలలో పేకాట శిబిరంపై పోలీస్ సిబ్బందితో దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ జి.నరేష్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలో వివిధ ప్రదేశాలలో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా నర్సిపూడి లో ముందస్తు సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.3,280 స్వాధీనం చేసుకుని నగదు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే వారిపైనా ఏపీ గేమింగ్ యాక్ట్ పై కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


క్రీడాపరికరాలను అందజేస్తున్న నిర్వాహకులు

క్రీడా పరికరాల బహూకరణ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక జడ్పి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు గొల్లప్రోలు కిరాణా వర్తక సంఘం ప్రతినిధులు క్రీడా పరికరాలను బహుకరించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవసరమైన క్రీడా పరికరాలను బహుకరించిన వర్తక సంఘం ప్రతినిధులకు స్కూల్ హెచ్ఎం సిహెచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు దంగేటి రామకృష్ణ, గొల్లపూడి సత్యనారాయణ, కొసిరెడ్డి అప్పలరాజు, కొత్త గణేష్‌రావు, దంగేటి రాజా, జలిగంపల ప్రసాద్ పాల్గొన్నారు.


డిఎస్‌సిలో విజేతను సత్కరిస్తున్న ఎంఎల్ఎ నెహ్రూ

డిఎస్‌సిలో జ్యోతుల ఫౌండేషన్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - జగ్గంపేట

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డిఎస్‌సి కోచింగ్‌లో శిక్షణ తీసుకున్న దేవిశెట్టి దివ్య 92.04 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, జెడ్. రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, కంటే ఉదయభాస్కర్, తోలేటి సూర్యనారాయణ, నీలం చక్రధర్‌రావు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ గ్రామానికి చెందిన పలివెల జీవనం ఇటీవల మృతి చెందాడు. దీంతో జీవనంతో చదువుకున్న పదో తరగతి పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మంగళవారం రూ.30 వేలను అందజేశారు. తన చిన్ననాటి స్నేహితుడు మృతి బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన స్నేహితులు జోకా ప్రసాద్, చక్రధర్, వీరబాబు, లోవరాజు, తిరుపతయ్య పాల్గొన్నారు.

ముగిసిన హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలు

- విజేతగా నిలిచిన జార్ఖండ్ జట్టు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో రెండు వారాలుగా జరుగుతున్న ఇండియన్ ఆయిల్ 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళల జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. దేశవ్యాప్తంగా 30 జట్లు పాల్గొన్న ఈ హాకీ టోర్నీలో భాగంగా మంగళవారం ఫైనల్ మ్యాచ్‌లో జార్ఖండ్, హర్యానా జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో విన్నర్‌గా జార్ఖండ్ జట్టు నిలిచింది. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. విన్నర్‌గా నిలిచిన జార్ఖండ్ జట్టుకు, రన్నర్ జట్టు హర్యానా, మూడో స్థానంలో నిలిచిన ఉత్తరప్రదేశ్ జట్లుకు అతిథులు చేతుల మీదుగా మెడల్స్, ట్రోఫీలను అందజేశారు. ముగింపు వేడుకలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎస్‌పి బిందుమాధవ్, జోనల్ ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి బ్రిగేడియర్ రాకేష్ శర్మఆవాస్తి, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ మానీషా, పిఠాపురం జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సిజిఎం జుబ్బ్ గార్గ్, కెఎస్‌పిఎల్ సిఇఒ మురళీధర్, కోరమండల్ కాకినాడ యూనిట్ హెడ్ కె.జగన్నాథం, ఎఎం గ్రీన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎఎస్.నాయుడు, అరబిందో జిఎం సిఎస్ఆర్ డి.సుధాకర్, హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఎం.నిరంజన్‌రెడ్డి, అధ్యక్షులు బి.చాణిక్యరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రెండు వారాల పాటు నిర్వహించుకున్న ఈ టోర్నమెంటు విజయవంతంగా ముగిసిందని అన్నారు. సహకరించిన స్పాన్సర్స్ అందరికీ, ప్రాముఖ్యంగా క్రీడాకారులకు భోజనం, వసతి, భద్రత, రావాణా వంటి ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులకు ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు.



విన్నర్ జట్టుకు ట్రోఫీని అందిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

డీ వార్మింగ్ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో నులి పురుగు నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ డాక్టర్ జె.నరసింహనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నివారణ ద్వారా పిల్లలలో రక్త హీనతను నివారించవచ్చన్నారు. పిల్లలందరూ అల్బెండజోల్ 400 ఎంజి మాత్రను వేసుకోవాలని సూచించారు. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరల లోపు సుమారు 4,75,748 బాలబాలికలకు ఉచితంగా మాత్రలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్, పిఒ-ఆర్ బిఎస్‌కె మరియు ఎన్‌సిడి డాక్టర్ అరుణ, డిఒ రమేష్, డిఐఒ డాక్టర్ సుబ్బరాజు, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** పట్టణ, మండలంలోని చేబ్రోలు పిహెచ్‌సి ఆధ్వర్యంలో కళాశాలలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల మందులు పంపిణీ చేశారు. పిహెచ్‌సి పరిధిలో 5893 మందికి ఈ మందులు పంపిణీ చేసినట్లు ఆసుపత్రి పర్యవేక్షకులు గంగాధర్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రత్తిపాడు** నులి పురుగుల నివారణా దినోత్సవంలో ప్రత్తిపాడు పాఠశాల, రాచపల్లి పిహెచ్‌సి కేంద్రంలో నులు పురుగుల నివారణా మందులను ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 19 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలందరూ తప్పకుండా ఈ మందులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లంపకలోవ సొసైటీ ఛైర్మన్ వరుపుల రామకృష్ణ, నాయకులు కొమ్మల కన్నబాబు, అమరాధి వెంకట్రావు, చక్కపల్లి నవీన్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక బిబిఆర్, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్స్‌లో డి.వార్మింగ్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య పాల్గొన్నారు. మంగళవారం హాజరుకాని విద్యార్థులకు ఈ నెల 20 వ తేదీన మాత్రలు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కె.ప్రభ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **జగ్గంపేట** రాజపూడి పిహెచ్‌సి పరిధిలోని జడ్‌పి హైస్కూల్లో సర్పంచ్ బుసాల విష్ణుమూర్తి డి.వార్మింగ్ మాత్రలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు ఎన్.పూజ, ఎం.మురళీ, రాజపూడి పిఎసిఎస్ ఛైర్మన్ కంటే బుల్లబ్బు, టిడిపి నాయకులు రేఖా బులిరాజు, పాల్గొన్నారు. అలాగే స్థానిక శెట్టిబలిజపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద సిడిపిఒ ఎం.పూర్ణిమ అధ్యక్షతన తల్లులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పీడీ అర్.లక్ష్మి పాల్గొని మాట్లాడారు. జగ్గంపేట ప్రాజెక్ట్ పరిధిలోని 182 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న బాల బాలికలచే డి.వార్మింగ్ మాత్రలను మింగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు డి.వార్మింగ్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ దేవరపల్లి చెన్నారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** మండలంలోని కొమరగిరి పిహెచ్‌సి డాక్టర్ జి.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 14 ప్రభుత్వ, రెండు ప్రయివేటు విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు డి.వార్మింగ్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొమరగిరి సర్పంచ్ కండేపల్లి సత్యశ్రీ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పెద్దాపురం** పట్టణ, మండల పరిధిలోని అన్ని పాఠశాలలో విద్యార్థులతో డి.వార్మింగ్ మాత్రలను అధికారుల ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్లు ఎంఇఒ చౌదరి తెలిపారు. **గండేపల్లి** స్థానిక హైస్కూల్లో పిహెచ్‌సి వైద్యాధికారి నరేష్ ఆధ్వర్యంలో డి.వార్మింగ్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కెహెచ్.నాయక్, హెల్త్ సూపర్‌వైజర్ అరిగే చెల్లారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కాకినాడలో విద్యార్థికి మాత్రలు వేస్తున్న డిఎంహెచ్ఒ

యానాం వార్తలు


ఆర్ఎఒను సత్కరిస్తున్న ఎస్‌పి కోదండరామ్

ఆర్ఎఒను కలిసిన ఎస్‌పి కోదండరామ్

ప్రజాశక్తి - యానాం

యానాం ఎస్‌పిగా నూతనంగా నియమితులైన చింతా కోదండరామ్ మంగళవారం ఆర్ఎఒ మునిస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకూ ఆయన పుదుచ్చేరి పిఎపి విభాగం ఎస్‌పిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను యానాం ఎస్‌పిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఈ నెల 8న పోలీస్ హెడ్క్వార్టర్స్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఒకరినొకరు సత్కరించుకున్నారు. కోదండరాం స్థానికులు కావడంతో పలువురు అభినందనలు తెలిపారు.

15న మంత్రి లక్ష్మీనారాయణన్ యానాం రాక

ప్రజాశక్తి - యానాం

స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో నిర్వహించే 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణన్ ముఖ్య అతిధిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని స్థానిక ఎంఎల్‌శ్రీ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను ఆర్ఎఒ మునిస్వామి కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు.


ర్యాలీ నిర్వహిస్తున్న రీజెన్సీ విద్యా సంస్థల విద్యార్థులు

రీజెన్సీ విద్యార్థులచే హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

స్థానిక రీజెన్సీ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులచే వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. హెచ్ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాదరావు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిఇటి బి.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - జగ్గంపేట, గండేపల్లి

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని రైతులతో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమ ప్రభుత్వం అనడానికి నిదర్శనం సాగుచేసే రైతులకు సాయం అందించడమే అన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు మొదటి విడత సాయంగా రూ.7 వేలు వారి ఎకౌంట్లలో వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, వీరంరెడ్డి కాశీబాబు, తదితరులు పాల్గొన్నారు. గండేపల్లి మండలంలోని మురారి నుంచి స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వరకూ అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, ఎస్‌విఎస్. అప్పలరాజు, కోర్పు లచ్చయ్యదొర, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్, గండేపల్లి, జగ్గంపేట మండలాల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, జీను మణిబాబు, సొసైటీ ఛైర్మన్ కంటిపూడి సత్యనారాయణ, కందుల చిట్టిబాబు, జాస్తి వసంత్, మండల యువత అధ్యక్షుడు సుంకవల్లి రమేష్ పాల్గొన్నారు.


జగ్గంపేట ర్యాలీలో నమస్కరిస్తున్న ఎంఎల్ఎ నెహ్రూ

యూరియా కొరతపై రైతుల ఆవేదన

ప్రజాశక్తి - తాళ్లరేవు

యూరియా కొరత రైతులను ఆందోళనకు గురి చేస్తుంది. రబీ సాగు ప్రారంభంలో రైతులకు ఎరువులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ప్రకటనలు గుప్పించిన అధికారులు ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. గత 15 రోజులుగా మండలంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కోసం సహకార సంఘాలు, ఆగ్రో, ప్రయివేట్ వ్యాపారస్తులను కలిసినా స్టాకు లేదని సమాధానం రావడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. వరి సాగుకు చిన్న గుళికల యూరియా అవసరం కాగా పెద్ద గుళికల యూరియా పంపుతామని సమాధారం వస్తున్నట్లు తెలుస్తోంది. యూరియా కొరతపై అధికారుల నుంచి స్పందన ఉండటం లేదని రైతులు గిడ్ల చంద్రరావు, కడలి సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు అవసరమైన యూరియా అందుబాటులోకి తీసుకు రావడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సహకార వ్యవస్థ ద్వారా రైతుకు భరోసా: ఎంపి

ప్రజాశక్తి - ఏలేశ్వరం


ప్రమాణస్వీకారంలో ఎంపి, ఎంఎల్ఎ

సహకార వ్యవస్థ ద్వారా రైతులకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఎంపి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం లింగంపర్తి పిఎసిఎస్ అధ్యక్షుడుగా పెంటకోట మోహన్, సభ్యులుగా ధనేకుల అదృష్టదీపులు, వేమగిరి భరతరత్నం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబులతో కలిసి ఎంపి పాల్గొని మాట్లాడారు. సహకార సంఘాల బలోపేతానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు మేడిశెట్టి సూర్యకిరణ్, ఎస్‌జివి.సుబ్బరాజు, పెంటకోట శ్రీధర్, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, పిఎసిఎస్ సిఇఒలు జ్యోతుల నాగసత్యశ్రీనివాస్, ఉప్పల మణికుమార్‌రాజు పాల్గొన్నారు.

వారసత్వ స్థలాలను పరిరక్షిస్తాం

ప్రజాశక్తి - కాకినాడ

దేశంలో మైనార్టీ వారసత్వ ప్రదేశాలు, ప్రార్థనా మందిరాలతో పాటు తీర్థ యాత్ర కేంద్రాల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సంస్కృతి, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ స్పష్టం చేశారు. మంగళవారం ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ పార్లమెంటులో లేవనెత్తిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. దేశంలో ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిధిలో 3,685 కేంద్రీయ పరిరక్షిత స్మారక చిహ్నాలు ఉన్నాయని, వీటిలో మైనారిటీ వారసత్వ ప్రదేశాలుఉన్నాయని తెలిపారు. వీటి పరిరక్షణకు జాతీయ పరిరక్షణ విధానం-2014 ప్రకారం రాష్ట్రాలకు క్రమం తప్పకుండా కేంద్రం నిధులు కేటాయిస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి సర్కిల్‌కు గడిచిన 2020-21లో రూ.4.57 కోట్లు నిధులు కేటాయించగా, 2024-25లో రూ.6.50 కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు.

సంపద సృష్టి కేంద్రాలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట


సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ల ద్వారా సంపద సృష్టించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని జడ్‌పి సిఇఒ వివిఎస్.లక్ష్మణ్‌రావు, డిపిఒ వి.రవి కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని జి.మేడపాడు ఎల్‌టిసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కల్పించారు. గ్రామంలో అనుసరిస్తున్న విధానాలను అదనపు రిసోర్స్‌పర్సన్ పాలకుర్తి శ్రీనివాసాచార్యులుచౌదరి, శ్రీనుబాబు ఫోటో ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కాకినాడ, పెద్దాపురం డివిజన్ల డిఎల్‌డిఒలు వాసుదేవరావు, శ్యామల, డిఎల్‌పిఒలు అన్నామణి, బాలమణి, సర్పంచ్ పటానిదేవి, జిల్లాకు చెందిన ఎంపిడిఒలు, డిప్యూటీ ఎంపిడిఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటల రాయితీలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయభూపాలపట్నంలో ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వాలు ఇస్తున్న రాయితీలపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి కె.సత్యశైలజ మాట్లాడారు. ఎన్ఎంఇఒ పథకం ద్వారా పామాయిల్ సాగుకు హెక్టార్‌కు రూ.29 వేలు రాయితీ, 143 మొక్కలు ఉచితంగా అందజేస్తారన్నారు. పంట కాపు వచ్చే వరకూ ఏడాదికి రూ.5,250 చొప్పున ప్రభుత్వం సాయాన్ని అందిస్తాదని వివరించారు. అంతర్ పంటల నిమిత్తం ఏడాదికి రూ.5,250 చొప్పున నాలుగేళ్ల ఇస్తుందన్నారు. పండ్లు, పూల సాగు అభివృద్ధికి, మామిడి సాగుకు హెక్టార్‌కు రూ.50 వేలు, జీడిమామిడి, బొప్పాయికి రూ.30 వేలు, జామకు రూ.80,500, డ్రాగన్ ఫ్రూట్‌కు రూ. 2.70 లక్షలు రాయితీ ఇస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఈ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన వన శాఖ గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

అనధికార ఆక్వా చెరువు యజమానికి నోటీసు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం పి.మల్లవరం పంచాయతీ పెదపేట సమీపంలో అనధికారికంగా సాగు చేస్తున్న ఆక్వా చెరువు యజమాని వనిమిశెట్టి అప్పల నరసింహరావుకు మత్స్యశాఖ అధికారి అనురాధ నోటీసు జారీ చేశారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ పి.మల్లవరం గ్రామంలో సర్వేనెంబర్ 15 నుంచి 18లలో 6 ఎకరాల విస్తీర్ణంలో అనుమతి లేకుండా అనధికారికంగా ఆక్వా చెరువులు సాగు చేస్తున్నారని ఆమె అన్నారు. ఈ చెరువులకి అవుట్ లెట్ నిర్మించకుండా చెరువుల్లో నీటిని పంట కాలవల్లోకి వదులుతున్నారని వచ్చిన ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసినట్లు తెలిపారు. అనధికారికంగా నిర్వహిస్తున్న ఆక్వా సాగును నిలిపివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఆదిత్యలో గ్రంథపాలకుల దినోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి, పెద్దాపురం


పెద్దాపురంలో రంగనాథభ్‌కు నివాళి

మండలం సూరంపాలెంలో ఉన్న ఆదిత్య యూనివర్సిటీ గ్రంథాలయం విభాగం ఆధ్వర్యంలో మంగళవారం గ్రంథపాలకుల దినోత్సవాన్ని నిర్వహించారు. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తొలుత ఆధునిక గ్రంథాలయ రూపకర్త ఎస్ఆర్.రంగనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం రంగనాథ్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం, ప్యానల్ డిస్కషన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంబి.శ్రీనివాస్, ఎస్.రమాశ్రీ, ఆదిరెడ్డి రమేష్, జి.సురేష్, వి.సత్యనారాయణ, వివిధ విభాగాల డీన్‌లు, గ్రంథాలయ విభాగాధిపతి కె.అశోక్ కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **పెద్దాపురంలోని** శాఖా గ్రంథాలయంలో రంగనాథన్ 133వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.చిరంజీవి, కె.దుర్గాప్రసాద్, జి.శివకృష్ణ, వి.సుధీర్ పాల్గొన్నారు.

మట్టి తరలింపునకు వేలం ఖరారు

ప్రజాశక్తి - కాజులూరు

ఆలయ భూములకు సంబంధించి మట్టి తరలింపునకు వేలం ఖరారు అయిందని గొల్లపాలెం వేణుగోపాలస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించి మూడు ఎకరాల 26 సెంట్లు భూమిలో మెరకగా ఉన్న మట్టి మూడు అడుగుల మేర మట్టిని తవ్వుకునేందుకు వేలం పాట నిర్వహించగా 6 వ్యక్తులు పాల్గొన్నారని తెలిపారు. హెచ్చు పాటగా కాదా త్రినాథ్ రూ.14.53 లక్షలకు పాట పాడుకున్నట్లు ఆయన వెల్లడించారు.

కుండపోత వర్షం..ఈదురు గాలులు...

ప్రజాశక్తి- సామర్లకోట, యు.కొత్తపల్లి, తాళ్లరేవు

సామర్లకోట పట్టణంలో మంగళవారం కుండ పోత వర్షం కురిసింది. దీంతో డ్రెయినేజీల్లోని మురికి నీరు, వర్షపు నీరు కలిసి రోడ్లు కాల్వలను తలపించాయి. సుమారు 40 ఎంఎం వర్ష పాతం కురిసింది. స్థానిక రథం సెంటర్, ఆర్‌టిసి కాంప్లెక్స్ సెంటర్, ప్రెసిడెంట్ గారి వీధి, తెలుకుల వీధి, బుధవారం సంత మార్కెట్, తదితర ప్రాంతాలు జలమయంగా మారి, గడియార స్తంభం సెంటర్ వద్ద సాయిబాబా ఆలయం ఎదురుగా గల షాపుల్లోకి నీరు చేరడంతో చిన్నచిన్న వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే యు.కొత్తపల్లిలో మంగళవారం సాయంత్రం వాతావరణం మార్పు చెంది భారీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో ఒక్కసారిగా వాతావరణం మార్పు చెంది వర్షం రావడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే తాళ్లరేవు మండలంలో మంగళవారం వీచిన ఈదురుగాలులు, వర్షానికి పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తాళ్లరేవు రిజిస్టర్ కార్యాలయం సమీపంలో ఇంటి గోడపై విద్యుత్ స్తంభం విరిగిపడింది. జార్జి పేట రైస్ మిల్ సమీపంలో విద్యుత్తు లైన్‌పై చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. లచ్చిపాలెంలోను విద్యుత్‌కు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ ఎఇ ఇటి.వీరవెంకటసుబ్రహ్మణ్యం, సిబ్బంది విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


సామర్లకోటలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు


తాళ్లరేవులో విరిగిపడిన విద్యుత్ స్తంభం

నాయి బ్రాహ్మణ సంఘం హర్షం

ప్రజాశక్తి - సామర్లకోట

సెలూన్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, దేవాలయాల్లో నాయి బ్రాహ్మణులకు గౌరవ వేతనం రూ.25 వేలకు పెంపుదల చేయడంపై నాయిబ్రాహ్మణ సంఘం హర్షం ప్రకటించారు. మంగళవారం స్థానికంగా మోడీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వెదురుపాక సూర్యప్రకాశ్‌రావు, వెదురుపాక శివ, ఏడిద సురేష్, పుల్లేటికుర్తి తాతాజీ, బందరు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

స్వామిత్వపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం స్వామిత్వపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోవతల్లి, పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.జైకృష్ణ, కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతీ విద్యార్థిలోనూ క్రీడా స్ఫూర్తి అవసరమని డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు న్నారు. మంగళవారం స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో నిర్వహిస్తున్న సిబిఎస్ఇ క్లస్టర్-7 బాస్కెట్ బాల్ పోటీల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ పోటీలు దోహద పడతాయన్నారు. మట్టితో వినాయక ప్రతిమలు తయారు చేస్తున్న విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిబిఎస్ఇ క్లస్టర్-7 బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ చక్రవర్తి, శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ సిహెచ్.విజయప్రకాష్, జనసేన నాయకులు పాల్గొన్నారు.